

మిషన్ వాత్సల్యపై అవగాహన

ముప్పాళ్ల: పల్నాడు జిల్లా ముప్పాళ్లలో మిషన్ వాత్సల్యపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలను కో–ఆర్డినేటర్ సంతోష్ వివరించారు.



పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 2,01,210 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా, దిగువకు 1,85,107 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రాజెక్టు ప్రస్తుత నిల్వ 42.1600 టీఎంసీలు.



కొండ చిలువ కలకలం

కొల్లూరు: కరకట్ట దిగువున పెసర్లంక నక్కపాయ గండి వద్ద శుక్రవారం కొండ చిలువ కనిపించింది. వరద నీటిలో కొట్టుకు వచ్చిన దీన్ని చూసి స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

న్యూస్‌రీల్

శమీ శమయతే పాపం



అమరావతి: అమరారామంలో వేంచేసియున్న శ్రీ బాలచాముండికా సమేత అమరేశ్వర స్వామి దేవస్థానంలో దసరా శరన్నవ రాత్ర్యుత్సవాలలో భాగంగా గురువారం రాత్రి 7 గంటలకు చండీసమేత అమరేశ్వరస్వామికి పారువేట ఉత్సవం నిర్వహించారు. ఆలయంలోని రెండో ప్రాకారంలోని జమ్మిచెట్టు వద్ద శమీపూజను ఆలయస్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

రాజరాజేశ్వరిగా బాలచాముండేశ్వరీదేవి

అమరావతి క్షేత్రంలో శ్రీ దేవీ శరన్నవరాత్ర మహోత్సవాలలో భాగంగా ఆశ్వీయుజ శుద్ధ దశమి కావటంతో విజయదశమిని పురస్కరించుకుని బాలచాముండేశ్వరి అమ్మవారిని రాజ రాజేశ్వరీదేవిగా అలంకరించారు. దసరా వేడుకలలో చివరిరోజు రాజరాజేశ్వరీదేవిగా అలంకారంలో బాలచాముండేశ్వరి అమ్మవారు భక్తులదర్శనమిచ్చారు.

రూ.1.10 లక్షలు పలికిన లడ్డూ



కారెంపూడి: స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో దేవీ శరన్నవరాత్రులలో అమ్మవారికి సమర్పించిన లడ్డూకు శుక్రవారం వేలం నిర్వహించారు. వీరమల్ల రామారావు లడ్డూను రూ.1,10,000లకు దక్కించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మద్దు హనుమంతరావు, నగరేశ్వరస్వామి దేవాలయ కమిటీ అధ్యక్షుడు యక్కల శ్రీనివాసరావులు లడ్డూను రామారావుకు సంప్రదాయబద్ధంగా అందించారు. కార్యక్రమంలో భవిరిశెట్టి రామారావు, చీతిరాల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శమీ వృక్షానికి ప్రత్యేక పూజలు



తాడేపల్లి రూరల్: సీతానగరంలోని విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై విజయద దశమి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మేనేజర్ పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళా శాసనాలతో శుక్రవారం ఉదయం 9 గంటలకు వెంకటేశ్వరస్వామికి పంచామృతాలతో అభిషేకం, 11 గంటలకు శ్రీ భూ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారికి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించామని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ, శమీవృక్ష ఆరాధన, వెంకటేశ్వరస్వామి వారికి అష్టోత్తర శతనామార్చన నిర్వహించామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని తెలిపారు.

ఏపీపీ రాత పరీక్షకు పటిష్ట బందోబస్తు



గుంటూరు రూరల్: ఈ నెల 5వ తేదీన గుంటూరు–పలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ నిరుల ఇంజినీరింగ్ కళాశాలలో జరగనున్న అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల రాత పరీక్ష ఏర్పాట్లను గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి శుక్రవారం పరిశీలించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్) రమణ మూర్తిలతో కలిసి ఏర్పాట్లపై చర్చించారు.

సాయిబాబాను దర్శించుకున్న షట్లర్ పీవీ సింధు దంపతులు



పెదవడ్లపూడి(మంగళగిరి): పెదవడ్లపూడిలోని భగవాన్ షిరిడి సాయిబాబాను శుక్రవారం బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు దంపతులు దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం గోపూజ నిర్వహించారు. ఆలయ చైర్మన్ పాతూరి నాగభూషణం స్వాగతం పలికారు.

మృత్యుకూపాలుగా క్వారీ గుంతలు

‘ఈనెల 30న యడ్లపాడు మండలం చౌడవరం శివారు ప్రాంతంలో ఉన్న ఓ కొండ క్వారీ గుంతలో 9 మంది మైనర్లు ఈతకు వెళ్లారు. వీరిలో దాసరి పాలేనికి చెందిన 8వ తరగతి విద్యార్థి షేక్ మాబు ఈత రాక నీటమునిగి ఊపిరాడక మృతి చెందాడు. కుటుంబ సభ్యులకు తీరని శోకాన్ని మిగిల్చాడు.’

‘ఈనెల 29న దసరా సెలవులకు నకరికల్లు మండలం గుండ్లపల్లి స్నేహితుడి వద్దకు వెళ్లిన నలుగురు నాగార్జునసాగర్ కుడికాలువలో ఈత కోసం దిగి ఇద్దరు గల్లంతయ్యారు. వీరిలో చిలకలూరిపేటకు చెందిన షేక్ అర్షద్, బాపట్ల జిల్లా చీరాల ఆంధ్రకేసరినగర్‌కు చెందిన డి మార్కురూఫస్‌లు మృత్యువాత పడ్డారు.’

- ఇష్టానుసారంగా గ్రావెల్, కంకర తవ్వకాలు
- గుంతల వద్ద కనిపించని హెచ్చరిక బోర్డులు
- పట్టించుకోని అధికారులు
- తల్లిదండ్రులకు పుత్ర శోకం



చౌడవరంలో ఈ ఏడాది మే 6న దాసరిపాలెం బీటెక్ విద్యార్థి కొర్నెపాటి తేజ్‌ను బలిగొన్న క్వారీ గుంత

యడ్లపాడు: యడ్లపాడు పరిసర ప్రాంతాల్లోని క్వారీ గుంతలు మృత్యుకూపాలుగా మారుతున్నాయి. యువకులు, చిన్నారులు ఈత రాకుండానే నీటిలో దిగి ప్రాణాలు కోల్పోతున్నారు. లోతు అంచనా లేక మునిగిపోయి ప్రాణాలు కోల్పోతున్నారు. పండగ సెలవుల్లో సరదా ఆటలు, ఆనందం కోసం బయటకు వెళ్తున్న పిల్లలు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. తాజాగా జిల్లాలో నకరికల్లు, యడ్లపాడు మండలాల్లో ముగ్గురు మృత్యువాత పడిన విషయం విదితమే. యడ్లపాడు మండలంతోపాటు జిల్లాలో గ్రావెల్, మెటల్ క్వారీ ప్రాంతాల్లో భారీ గుంతలు పుష్కలంగా ఉన్నాయి. తల్లిదండ్రులు, అధికారులు అప్రమత్తంగా లేకపోతే ఇలాంటి దుర్ఘటనలు పునరావృతమయ్యే ముప్పు తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఎందుకిలా జరుగుతోంది?

పల్లెల్లో ముఖ్యంగా గ్రావెల్, కంకర తవ్వకాలు జరిగే ప్రాంతాల్లో లోతైన క్వారీ గుంతలు ఏర్పడుతున్నాయి. వర్షాకాలంలో అవి నీటితో నిండి చెరువుల్లా కనిపిస్తాయి. అయితే, వాటి లోతు, ఊబి అంచనా వేయడం కష్టం. ఈత రాకపోయినా, వచ్చినా..ఈ గుంతల్లో దిగడం అత్యంత ప్రమాదకరం. గ్రామీణ ప్రాంతాల్లో స్విమ్మింగ్ పూల్స్ లేకపోవడం వల్ల పిల్లలు చెరువులు, కాలువల్లో ఈత నేర్చుకోవడానికి వెళ్తున్నారు. సరైన శిక్షణ, పర్యవేక్షణ లేనందునే ఇటువంటి ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రమాదకరమైన నీటి వనరుల వద్ద హెచ్చరిక బోర్డులు, కంచెలు లేకపోవడంతో చాలామంది వాటి లోతు, ప్రమాదం గురించి అంచనా వేయలేకపోతున్నారు. చాలా ప్రాంతాల్లో పిల్లలు ఒంటరిగా ఈతకు వెళ్తున్నారు. పెద్దల పర్యవేక్షణ లేకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నా వెంటనే గుర్తించలేకపోతున్నారు. కొత్తగా ఈత నేర్చుకునే వారు, ఈత రానివారు కూడా లోతైన నీటిలోకి దిగి ప్రమాదాల బారిన పడుతున్నారు. క్వారీ గుంతల్లో లోతు ఎక్కువగా ఉంటుందని, ఊబి ఉంటుందని తెలియక గల్లంతవుతున్నారు.



యువకుడి ప్రాణాలు బలిగొన్న యడ్లపాడు ఎస్టీకాలనీలో ఉన్న ఈ క్వారీ గుంత

అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు

ప్రమాదకరమైన క్వారీ గుంతలు, నీటి వనరుల చుట్టూ హెచ్చరిక బోర్డులు, కంచెలు ఏర్పాటు చేయాలి. ఈ విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాలువలు, చెరువులు, క్వారీ గుంతల వద్ద నీటిపారుదల శాఖ, విపత్తుల నిర్వహణ శాఖ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, అలాగే పోలీసులు కూడా సెలవు, పండుగ రోజుల్లో కనీసం డ్రోన్ ద్వారా గస్తీని పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

తల్లిదండ్రులదే ప్రధాన బాధ్యత



పిల్లల కదలికలపై తల్లిదండ్రులు నిఘా ఉంచాలి. సెలవుల్లో, పండగ దినాల్లో పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారో గమనించాలి. స్నేహితులతో కలిసి ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా చూడాలి. ఈత రానివారు నీటిలోకి దిగకుండా జాగ్రత్తలు చెప్పాలి.

–టి శివరామకృష్ణ, ఎస్ఐ, యడ్లపాడు

రక్షణ పరికరాలు ఉపయోగిస్తే మేలు..



నీటితో ఆటలొద్దు. ఎక్కడ పడితే అక్కడ నీటిలో ఈతకు దిగరాదు. వాటిలోతు అంచనా వేసి జాగ్రత్తగా ఉండాలి. బాగా ఈత వచ్చిన పెద్దల పర్యవేక్షణలో మాత్రమే ఈత కొట్టేలా చూడాలి. ఈత నేర్చుకునేటప్పుడు తప్పనిసరిగా పెద్దలు, శిక్షకుల పర్యవేక్షణ ఉండాలి. ఈతకు వెళ్లినప్పుడు ట్యూబ్స్, లైఫ్ జాకెట్లు వంటి రక్షణ పరికరాలను ఉపయోగించడం ఉత్తమం.

–బి సుబ్బానాయుడు, సీఐ, చిలకలూరిపేట రూరల్

ఇంటర్ పబ్లిక్ పరీక్షల షెడ్యూల్ విడుదల

నరసరావుపేట ఈస్ట్: ఇంటర్మీడియేట్ పబ్లిక్ పరీక్షల షెడ్యూల్‌ను ప్రభుత్వం ప్రకటించింది. ఈమేరకు ఇంటర్మీడియేట్ బోర్డు కార్యదర్శి డాక్టర్ నారాయణ భరత్ గుప్త ఉత్తర్వులు జారీ చేసినట్టు జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాశాఖాధికారి ఎం.నీలావతిదేవి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ఫిబ్రవరి 23వ తేదీ నుంచి మార్చి 24 వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు ఫిబ్రవరి 24వ తేదీ నుంచి మార్చి 23వ తేదీ వరకు జరగనున్నాయి. రెగ్యులర్, బ్యాక్‌లాగ్ విద్యార్థులకు అనుకూలంగా ఉండేలా టైంటేబుల్ సవరించారు. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. మానవ విలువలు సబ్జెక్ట్‌ను జనవరి 21న, పర్యావరణం పేపర్‌ను జనవరి 23వ తేదీన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహిస్తారు. ప్రాక్టికల్ పరీక్షలను జనరల్ విద్యార్థులకు ఫిబ్రవరి 1 నుంచి 10వతేది వరకు, ఒకేషనల్ విద్యార్థులకు జనవరి 27 నుంచి ఫిబ్రవరి 10వతేది వరకు ఉదయం, సాయంత్రం రెండు షెషన్స్‌లో నిర్వహిస్తారు. సమగ్ర శిక్ష ఒకేషనల్ ట్రేడ్ పరీక్షను ఫిబ్రవరి 13వతేది ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనుంది.

నేడు స్కూల్‌గేమ్స్ కో–ఆర్డినేటర్ల సమావేశం

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా స్కూల్‌గేమ్స్ మండల, డివిజన్ కో–ఆర్డినేటర్ల సమావేశం ఈనెల 4వతేదీ ఉదయం 10 గంటలకు లింగంగుంట్ల శంకరభారతీపురం జడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్టు స్కూల్‌గేమ్స్ జిల్లా కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్, మహిళా కార్యదర్శి వి.పద్మావతి శుక్రవారం తెలిపారు. సమావేశంలో క్రీడాకారుల నమోదు, క్రీడా తేదీలు, క్రీడా మైదానాలు అంశాలపై చర్చించనున్నట్టు తెలిపారు. అలాగే మండల స్థాయి క్రీడాకారులకు ఫామ్–ఏ, డివిజన్ క్రీడాకారులకు ఫామ్–బీ వివరణలు, క్రీడాకారులకు మధ్యాహ్న భోజనం, వసతి, ఇతర సౌకర్యాలపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. స్కూల్‌గేమ్స్ విజయవంతం చేయాలని కోరారు.

పింఛన్ నగదు మాయం

- పింఛన్ నగదు సొంతానికి వాడుకున్న వీఏవో
- పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించిన పింఛన్‌దారులు
- యూరియా ఇప్పిస్తానంటూ కూడా నగదు వసూలు చేశాడంటూ ఆరోపణలు.
- ఎంపీడీవో ఆధ్వర్యంలో విచారణ
- తిరిగి చెల్లించే విధంగా లిఖిత పూర్వక అంగీకార పత్రం



పంచాయతీ కార్యాలయంలో నిర్బంధంలో వీఏవో మనోజ్‌కుమార్

దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు గ్రామ వీఏవో మనోజ్‌కుమార్ సామాజిక పింఛన్ల నగదు లబ్ధిదారులకు ఇవ్వకుండా సొంతానికి వినియోగించుకున్నాడు. శుక్రవారం గ్రామానికి చెందిన కొందరు పింఛన్‌దారులు పంచాయతీ కార్యాలయంలో అతనిని నిర్బంధించారు. వివరాల్లోకి వెళితే... ఈనెల 1వ తేదీన గ్రామంలోని ఒకటో వార్డులో 58 మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసేందుకు గ్రామ రైతుభరోసా కేంద్రం వీఏవో మనోజ్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగించారు. వాటిలో సుమారు 20 మంది లబ్ధిదారుల వద్ద వేలిముద్రలు తీసుకున్నాడు. వేలిముద్రలు సరిగా పడలేదు, డబ్బులు గురువారం వచ్చి ఇస్తానంటూ నమ్మించి వెళ్లిపోయాడు. డబ్బులు ఇస్తాడని ఎదురు చూసిన బాధితులు ఎంతకూ రాకపోవటంతో ఫోన్లు చేసి పిలిపించారు. బ్యాంకుకు వెళ్లి వస్తానని తాత్సారం చేసి పంచాయతీ కార్యాలయానికి చేరుకోవటంతో అక్కడ లబ్ధిదారులు పింఛన్ నగదు కోసం నిలదీశారు. పింఛన్ నగదు లేవు రెండు రోజుల్లో సర్దుతానంటూ చెబుతుండటంతో అక్కడే నిర్బంధించారు. టీడీపీ నాయకులు, గ్రామపెద్దలు పంచాయతీ కార్యాలయానికి చేరుకుని పోలీసులను తెలియచేశారు. పోలీసులు తీసుకొచ్చి ఎంపీడీవోకు అప్పగించారు. దీనిపై ఎంపీడీవో జి.శ్రీనివాస్ తెలుపుతూ 20 మందికి పింఛన్ డబ్బులు ఇవ్వాల్సిన మాట వాస్తవమే, ఎంత మేర ఇవ్వాలన్నది లాగిన్‌లో శుక్రవారం తెలుస్తుందన్నారు. వీఏవో వాడుకున్న నగదు శనివారం తీసుకొచ్చి అప్పగించే విధంగా లిఖితపూర్వకంగా రాయించుకున్నట్లు తెలిపారు. నగదు అప్పగించని పక్షంలో తదుపరి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో తెలిపారు.

యూరియా ఇప్పిస్తానని నగదు వసూలు చేసినట్లు ఆరోపణలు

ఇది ఇలా ఉండగా ప్రస్తుతం యూరియా డిమాండ్‌ను అసరాగా తీసుకుని యూరియా తెప్పించి ఇస్తానని కొంత మంది రైతుల దగ్గర నగదు వసూలు చేసినట్లు తెలిసింది. డబ్బులిచ్చిన రైతులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఎంత మేర వసూలు చేశారన్నది స్పష్టంగా తెలియరాలేదు.

ఆరున స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల ప్రదానం

- రాష్ట్ర స్థాయిలో అవార్డుకు ఎంపికైన దళిత బహుజన రిసోర్స్ సెంటర్
- జిల్లా స్థాయిలో 16 విభాగాల్లో 51 మంది వ్యక్తులు, సంస్థలకు అవార్డులు
- వెల్లడించిన జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా



మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా పక్కన జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛత కార్యక్రమాలను ప్రోత్సహిస్తూ అందించనున్న స్వచ్ఛ ఆంధ్ర అవార్డులను ఈనెల 6న ప్రదానం చేయనున్నామని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా పేర్కొన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డుల పేరుతో కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛతా అవార్డులను ప్రకటిస్తోందని, అదే బాటలో స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు ప్రదానం చేయడం ద్వారా దేశంలోనే మొదటి స్వచ్ఛతా అవార్డులను అందిస్తున్న రాష్ట్రంగా ఆంధ్ర ప్రదేశ్ అవతరించిందని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ స్వచ్ఛతా ఎన్జీఓగా దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఎంపికైనట్లు వెల్లడించారు. జిల్లా స్థాయిలో 16 విభాగాల్లో 51 మంది వ్యక్తులు, సంస్థలు అవార్డులు దక్కించుకున్నాయన్నారు. అక్టోబరు 6న జిల్లా ఇన్‌చార్జి మంత్రి చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేస్తామన్నారు. స్వచ్ఛ నగర, మండలాలు, స్వచ్ఛ గ్రామ పంచాయతీలు, పాఠశాలలు, ఆసుపత్రులు, కార్యాలయాలు, రైతు బజార్లు, బస్‌స్టేషన్లు, పరిశ్రమలు మొదలైన వివిధ విభాగాలలో అవార్డులకు ఎంపిక చేయడం జరిగిందని వివరించారు. మూడు దశల్లో స్వచ్ఛ ఆంధ్ర–2025 రేటింగ్, ర్యాంకింగ్ జరిగిందని తెలిపారు. రాష్ట్ర, జిల్లాస్థాయి అవార్డు గ్రహీతల పూర్తి వివరాలను ఎస్ఎఎస్ఎ (సాసా) పోర్టల్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని చెప్పారు. ఈ విజయాలు స్వర్ణ ఆంధ్ర –స్వచ్ఛ ఆంధ్ర ఉద్యమాన్ని మరింత బలంగా ముందుకు తీసుకెళ్లే స్ఫూర్తినిస్తాయని జిల్లా కలెక్టర్ తెలిపారు.

మూడో దశలో 25 గ్రామాల్లో రీసర్వే

నరసరావుపేట: జిల్లాలో శుక్రవారం నుంచి మూడో దశ రీ సర్వే ప్రారంభం అవుతుందని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాలో 150 గ్రామాలలో రీసర్వే పూర్తి చేశామని, ప్రస్తుతం మరో 41 గ్రామాలలో జరుగుతుందని అన్నారు. మూడో దశలో 25 గ్రామాలలో రీసర్వే చేయబోతున్నామని తెలిపారు. రైతులందరూ రీసర్వేకి సహకరించాలని కోరారు. రెవెన్యూ సిబ్బంది మీ భూమి సర్వే ఎప్పుడు చేస్తారో ముందుగా నోటీసు ద్వారా తెలియజేస్తారని, ఆ సమయంలో రైతులు తప్పనిసరిగా హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. రీసర్వేలో రైతుల నుంచి అందిన అభ్యంతరాల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పరిశ్రమల అభివృద్ధికి బ్లూ ప్రింట్ తయారు చేయండి

నరసరావుపేట: జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి బ్లూ ప్రింట్ తయారు చేయాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పరిశ్రమల శాఖ, నైపుణ్యాభివృద్ధి శాఖలపై సమీక్ష నిర్వహించారు. రెండు శాఖల సిబ్బంది, కార్యక్రమాల గురించి వివరాలు అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అందించిన భూముల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నష్టాల్లో నడుస్తున్న పరిశ్రమలకు ప్రభుత్వం నుంచి సాయం అందించగలిగే అవకాశాలను అన్వేషించాలన్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కోర్సుల్లో శిక్షణ ఇవ్వడంపై నైపుణ్యాభివృద్ధి శాఖ దృష్టి సారించాలన్నారు. శిక్షణ పొందిన అభ్యర్థులందరికీ 100శాతం ప్లేస్‌మెంట్ దక్కేలా చూడాలన్నారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, ఎల్‌డీఎం రాంప్రసాద్, డీఆర్‌డీఏ అసిస్టెంట్ పీడీ ఆర్.ప్రతాప్, జిల్లా పరిశ్రమల అధికారి నవీన్, ఏపీఐఐసీ జెడ్ఎం డాక్టర్ ఎల్ ఎం నరసింహారావు, జిల్లా అదనపు నైపుణ్య అభివృద్ధి అధికారి రామాంజనేయులు పాల్గొన్నారు.

జయ మంగళం

- విజయదశమి రోజున భక్తులతో కిక్కిరిసిన ఇంద్రకీలాద్రి
- వరద నేపథ్యంలో ఆదిదంపతుల నదీ విహారం రద్దు
- హంసవాహనంపై పూజలతో సరి
- దుర్గమ్మ సన్నిధికి కొనసాగుతున్న భవానీల రద్దీ



హంస వాహన సేవ కోసం ఆది దంపతులను ఊరేగింపుగా తీసుకువస్తున్న సిబ్బంది



హంస వాహనంపై కొలువుదీరిన ఆదిదంపతులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల రాకతో కృష్ణమ్మ పులకించింది. దసరా ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆదిదంపతులకు హంస వాహన సేవ జరిగింది. కృష్ణానది వరద నేపథ్యంలో శ్రీ గంగా పార్వతి(దుర్గ) సమేత మల్లేశ్వర స్వామి వార్లకు ఏటా నిర్వహించే నదీ విహారాన్ని రద్దు చేశారు. హంస వాహన సేవను మాత్రమే నిర్వహించగా, సేవను వీక్షించేందుకు పెద్ద ఎత్తున భక్తులు కృష్ణానది తీరానికి చేరుకున్నారు. హంస వాహనంపై అధిష్టించిన ఆదిదంతులకు ఆలయ ఈవో శీనానాయక్ దంపతులు పూజాకార్యక్రమాలను నిర్వహించారు. హంస వాహనంపైకి ఆలయ ఈవో, వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్ దంపతులతో పాటు వేద పండితులు, ఆలయ అర్చకులను మాత్రమే అనుమతించారు. హంస వాహనంపై కొలువు తీరి పూజలందుకుంటున్న ఆది దంపతులను ప్రకాశం బ్యారేజీ, దుర్గాఘాట్, దుర్గగుడి ఫ్లైవోవర్, భవానీ ఘాట్ల నుంచి భక్తులు దర్శించుకున్నారు. సాయం సంధ్య వేళ దుర్గాఘాట్‌లో కృష్ణమ్మకు నవ హారతులను ఇవ్వగా, అదే సమయంలో హంస వాహన సేవ జరిగింది. ఒకే సమయంలో రెండు సేవలను వీక్షించే మహాభాగ్యం భక్తులకు కలిగింది.

క్యూలైన్ల ద్వారానే..

భవానీలు, భక్తుల రాకతో మరో రెండు రోజులపాటు ఉత్సవ ఏర్పాట్లు కొనసాగుతాయని ఆలయ అధికారులు పేర్కొన్నారు. శని, ఆదివారాలలో అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులు క్యూలైన్ల ద్వారానే కొండపైకి చేరుకోవాలని సూచించారు. అంతే కాకుండా వీఐపీ దర్శనాలు ఉండవని పేర్కొన్నారు.

కనులపండువగానగరోత్సవ సేవ

హంసవాహన సేవ కోసం ఆది దంపతులు దేవస్థానం నుంచి ఊరేగింపుగా బయలుదేరారు. మల్లేశ్వరస్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాల నుంచి ప్రారంభమవగా.. ఆలయ అధికారులు ఆదిదంపతుల పల్లకీకి భుజం పట్టగా, దుర్గాఘాట్‌కు బయలుదేరింది. ఆదిదంపతులకు ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. నదీ ప్రవాహం అధికంగా ఉండటంతో హంస వాహనంపైకి కేవలం 25 మందిని మాత్రమే అనుమతించారు.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుల నియామకం

నరసరావుపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా గురజాలకు చెందిన టీజీవీ కృష్ణారెడ్డి, పెద కూరపాడుకు చెందిన జాలయ్యను సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (సీఈసీ) మెంబర్లుగా నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

వైఎస్సార్ సీపీ ఎస్ఈసీ మెంబర్లుగా ఇరువురు నియామకం..

నరసరావుపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పల్నాడు జిల్లాకు చెందిన ముగ్గురిని స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్(ఎస్ఈసీ) మెంబర్లుగా నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు కొమ్మారెడ్డి చలమారెడ్డి(మాచర్ల), ఈదా సాంబిరెడ్డి (పెదకూరపాడు), కొమ్మినేని వెంకటేశ్వర్లు (గురజాల) నియమితులయ్యారు.

రెండు బైక్‌లు ఢీ: యువకుడు మృతి

మరొక వ్యక్తికి తీవ్రగాయాలు

రొంపిచర్ల: మండలంలోని మర్రిచెట్టుపాలెం, మాచవరం గ్రామాల మధ్య రహదారిపై శుక్రవారం రెండు మోటారు సైకిళ్లు ఢీకొని ఒక వ్యక్తి మృతిచెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. మాచవరం గ్రామానికి చెందిన వి.గోపిరెడ్డి (21) మర్రిచెట్టుపాలెం గ్రామంవైపు నుంచి మోటారు సైకిల్‌పై మాచవరం గ్రామం వెళుతుండగా అదే మార్గంలో నరసరావుపేట నుంచి కుంకులకుంట వెళుతున్న హుస్సేన్‌కు చెందిన మోటారు సైకిళ్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గోపిరెడ్డి తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. గాయాలైన హుస్సేన్‌ను నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేర నియంత్రణకు ప్రత్యేక చర్యలు

ఎస్పీ బి.ఉమామహేశ్వర్

బాపట్ల: బాపట్ల జిల్లా వ్యాప్తంగా నేర నియంత్రణకు డ్రోన్ నిఘా ఏర్పాటు చేయాలని జిల్లా పోలీసులను జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఆదేశించారు. ఆధునిక సాంకేతికతను వినియోగించుకుని ప్రత్యేకంగా డ్రోన్ కెమెరాల ద్వారా సముద్రతీర పర్యాటక ప్రదేశాల్లో, శివారు ప్రాంతాలలో శుక్రవారం నిఘా ఏర్పాటు చేయించారు. సూర్యలంక, రామాపురం, వాడరేవు తదితర సముద్ర తీర ప్రాంతాలలో డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తున్నారని ఎస్పీ చెప్పారు. అసాంఘిక చట్ట వ్యతిరేక కార్యకలాపాలను కట్టడి చేయడమే ప్రధాన లక్ష్యంగా నిఘా కోసం డ్రోన్లను వినియోగిస్తున్నామన్నారు. అసాంఘిక కార్యకలాపాల గురించి సమాచారం తెలిస్తే టోల్ ఫ్రీ నంబర్ 112 కు కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తులు అరెస్టు

తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని, వారినుంచి 10 కేజీల గంజాయి స్వాధీనం


విలేకర్లతో మాట్లాడుతున్న సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు, ముసుగుల్లో నిందితులు

నకరికల్లు: ఒడిశా నుంచి గంజాయి అక్రమ రవాణా చేస్తూ పలు ప్రాంతాలలో అమ్మకాలు చేస్తున్న నిందితులను అరెస్టు చేసినట్లు సత్తెనపల్లి డీఎస్పీ ఎం.హనుమంతరావు తెలిపారు. నకరికల్లు పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మండలంలోని చల్లగుండ్ల పరిధిలో గంజాయి అక్రమ రవాణా అమ్మకాలు జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సత్తెనపల్లి రూరల్ సీఐ పి.కిరణ్, ఎస్ఐ కె.సతీష్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి తొమ్మిది మంది నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నున్న 10 కిలోల గంజాయి, ఒక ద్విచక్ర వాహనం, రూ.5వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రాజుపాలెం మండలం గణపవరం గ్రామానికి చెందిన నర్రా హనుమంతరావు, విశాఖపట్నం సాలిపేటకు చెందిన పెంటకోట శంకరరావు, నకరికల్లుకు చెందిన కగ్గా శ్రీనివాసరావు, రాజుపాలెం మండల పులిచింతల నిర్వాసిత గ్రామానికి చెందిన కాపర్తి మల్లిఖార్జునరావు, బిహార్ రాష్ట్రానికి చెందిన అగయ్య వినోద్ యాదవ్, నకరికల్లు మండలానికి చెందిన బాణావతు బాలానాయక్, రాజుపాలెం మండలం చౌటపాపాయపాలెంకు చెందిన సాదుపాటి శ్రీనివాసరావు, కొండమోడు గ్రామానికి చెందిన బండారు హనుమంతరావు, ఆవుల పెద్దసాంబయ్యలను నిందితులుగా గుర్తించి అరెస్టు చేసినట్లు చెప్పారు. మరో ఎనిమిది మంది పరారీలో ఉన్నట్లు తెలిపారు. నర్రా హనుమంతరావు, పెంటకోట శంకరరావులు కలసి ఒడిశా నుంచి విశాఖపట్నం ప్రాంతాలకు గంజాయి తీసుకొచ్చి అమ్మకాలు చేసేవారన్నారు.

■ శంకరరావు కుమార్తె రతి అనే మహిళ ఫోన్ పే ద్వారా విక్రయ లావాదేవీలు జరిపినట్లు తెలిపారు. మిగిలిన నిందితులు ఈ ఇరువురి వద్ద గంజాయిని కొనుగోలు చేసి పలు ప్రాంతాల్లో అమ్మకాలు జరిపేవారని చెప్పారు. కిలో రూ.500లకు కొనుగోలు చేసిన గంజాయిని చిన్నచిన్న పొట్లాలు కట్టి కిలో రూ.50వేలకు విక్రయించేవారన్నారు. పారిపోవడానికి సిద్ధమైన నిందితులను చల్లగుండ్ల సమీపంలో అదుపులోకి తీసుకుని వారివద్ద నున్న గంజాయి, ద్విచక్రవాహనం, నగదు, సెల్‌ఫోన్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎస్ఐ కె.సతీష్, పోలీసు సిబ్బందిని, హోంగార్డులను డీఎస్పీ అభినందించారు. యువత మాదక ద్రవ్యాలకు, గంజాయికి అలవాటు పడి జీవితాలు చిన్నాభిన్నం చేసుకోవద్దని సూచించారు.

మహాత్మాగాంధీ జీవితం అందరికీ ఆదర్శం

- 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ ఎన్.సత్య శ్రీ
- సబ్ జైల్‌లో ఖైదీల సంక్షేమ దినోత్సవం


ఖైదీలనుద్దేశించి మాట్లాడుతున్న న్యాయమూర్తి

నరసరావుపేట టౌన్: మహాత్మా గాంధీ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ ఉన్నతమైన జీవితాన్ని గడపడానికి కృషి చేయాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ ఎన్.సత్య శ్రీ అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ జన్మదినోత్సవాన్ని ఖైదీల సంక్షేమ దినంగా సబ్‌జైల్లో గురువారం నిర్వహించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ, సబ్ జైలు సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాట్లాడారు. పొరపాటునో గ్రహపాటునో వివిధ నేరాల్లో ఉన్నవారు భవిష్యత్తులో పరివర్తన చెంది ఎటువంటి క్షణికావేశాలకు లోనుకాకుండా నేర ప్రవృత్తిని విడనాడి శాంతియుత జీవనం గడపాలన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ క్రీడాంశాలలో విజేతలకు ఆమె బహుమతి ప్రదానం చేశారు. మొదట మహాత్మా గాంధీ చిత్రపటానికి న్యాయమూర్తి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉపకారాగారం పర్యవేక్షకులు సురభి అంజయ్య, డిప్యూటీ జైలర్ రాములు నాయక్, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ బ్లేస్సినా, సిబ్బంది పాల్గొన్నారు.

●ఐదుతరాల అపూర్వ కలయిక


ముప్పాళ్ల మండలం కుందురువారిపాలెం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు బొక్కిసం సీతారామమ్మ 105వ జన్మదిన వేడుకలను గురువారం కుటుంబ సభ్యులు ఘనంగా జరుపుకొన్నారు. ఐదు తరాలకు చెందిన వారంతా ఒక చోటికి చేరి సీతారామమ్మకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపి, ఘనంగా సత్కరించారు. – ముప్పాళ్ల

ఉత్తమ పద్యనాటకం 'ఆదికవి నన్నయభట్టు'

ముగిసిన వీణా అవార్డ్స్ నాటకోత్సవాలు


బహుమతి అందుకుంటున్న దృశ్యం

తెనాలి: వీణా అవార్డ్స్ నాటకోత్సవాలు–2025 ఘనంగా ముగిశాయి. ఇక్కడి తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఆరు రోజులపాటు జరిగిన పద్యనాటక, సాంఘిక నాటక, నాటిక పోటీల ముగింపు సభ గురువారం రాత్రి జరిగింది. ఈ సభలో బహుమతులను ప్రదానం చేశారు. పద్యనాటక పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా శ్యామలాంబ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్–విజయనగరం సమాజం ప్రదర్శించిన 'ఆదికవి నన్నయభట్టు' నాటకం ఎంపికైంది. దీనికి ఉత్తమ రచన బహుమతిని కూడా శారద ప్రసన్న స్వీకరించారు. నన్నయ భట్టుగా నటించిన కె.సూర్యనారాయణకు ఉత్తమ నటుడిగా నిలిచారు.

'మోహినీ భస్మాసుర'కు అవార్డుల పంట

ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా అక్కినేని సాంస్కృతిక సమాజం వారి 'మోహినీ భస్మాసుర' నాటకం ఎంపికైంది. భస్మాసురుడిగా నటించిన డి.తిరుపతినాయుడు ఉత్తమ ప్రతినాయకుడు బహుమతిని, మోహినీగా నటించిన కేవీ పద్మావతి ఉత్తమ నటిగా, నారదుడు పాత్రధారి గవర సత్తిబాబు ఉత్తమ క్యారెక్టర్ నటుడుగా బహుమతులను గెలుచుకున్నారు. ఇదే నాటకానికి ఉత్తమ సంగీతం బహుమతిని కంది త్రినాథరావు అందుకున్నారు.

సత్తా చాటిన కళాకారులు

చందాల కేశవదాసు కళాపరిషత్ – మధిర వారు ప్రదర్శించిన 'కస్తూరి తిలకం' నాటకానికి తృతీయ ఉత్తమ బహుమతి లభించింది. దీనికి దర్శకత్వం వహించిన ఎస్.సుబ్బరాజు ఉత్తమ బహుమతిని గెలుచుకున్నారు. పద్మశ్రీ కల్లూరి సుబ్బారావు, లలిత కళాపరిషత్ – అనంతపురం వారి 'కాలభైరవ సంహారం' నాటకానికి ఉత్తమ రంగోద్దీపనం బహుమతిని సురభి రాయల్ స్వీకరించారు. టీజీవీ కల్చరల్ అకాడమీ – కర్నూలు వారు ప్రదర్శించిన 'శ్రీవేంకటేశ్వర మహాత్మ్యం' నాటకానికి ఉత్తమ ఆహార్యం బహుమతిని సి.శ్రీనివాసులు అందుకున్నారు. ఉత్తమ క్యారెక్టర్ నటి బహుమతిని 'పుత్రాదిచ్ఛేత్' నాటకంలో నాగులాంబ పాత్రధారి ఎస్.తిరుమల కైవసం చేసుకున్నారు. ఉత్తమ హాస్యనటిగా 'జగదేకసుందరి సామా'లో హసీనా, ఉత్తమ బాలనటుడిగా 'శ్రీవేంకటేశ్వర మహాత్మ్యం'లో బాలవెంకటేశ్వరుడు గెలుచుకున్నారు.

సాంఘిక నాటక విభాగంలో ...

సాంఘిక నాటక విభాగంలో ఉత్తమ ప్రదర్శనగా వెలగలేరు థియేటర్ ఆర్ట్స్– వెలగలేరు వారి 'నల్లత్రాచు నీడలో' నాటకం ఎంపికైంది. ఉత్తమ నటి సురభి లలిత, ఉత్తమ ప్రతినాయకురాలు (నల్లత్రాచు నీడలో)ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా జయకళానికేతన్ – విశాఖపట్నం వారి 'సిరికేళి' నాటకం ఎంపికైంది. ఉత్తమ దర్శకుడిగా, ఉత్తమ నటుడిగా బహుమతులను జరుగుల రామారావు (అందరూ మంచివారే... కానీ), ఉత్తమ రచన శ్రీశైలమూర్తి (యాగం) అందుకున్నారు. ఉత్తమ ప్రదర్శనగా విజయవాడ సాంస్కృతిక సమితి వారి 'మమ్మల్నీ బ్రతకనివ్వండి' గెలుచుకుంది. ఇదే నాటికకు ఉత్తమ దర్శకత్వం, ఉత్తమ సంగీతం, ఉత్తమ నటి, ఉత్తమ నటుడు బహుమతులు లభించాయి. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా పరమాత్ముని క్రియేషన్స్ –హైదరాబాద్ వారి 'ఎక్కడో...ఏదో' నాటిక ఎంపికైంది. ఇదే నాటికకు ఉత్తమ రచన బహుమతి లభించింది. ఉత్తమ తృతీయ ప్రదర్శనగా హర్ష క్రియేషన్స్ – విజయవాడ వారి 'భువి కోరని భ్రమణం' నాటిక ఎంపికైంది. కళల కాణాచి – తెనాలి, ఆర్ఎస్ఆర్ గ్రీన్‌వే ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో ఈ పోటీలు నిర్వహించారు. బహుమతుల ప్రదానోత్సవంలో అజో విభో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ, నాటకరంగ విశ్లేషకుడు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు, సినీ మాటల రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా, మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి, ఆర్.శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ఆటో డ్రైవర్ల సేవలో..' ప్రారంభం

తాడేపల్లి రూరల్: 'ఆటో డ్రైవర్ల సేవలో.. ' పథకాన్ని శనివారం ప్రారంభించనున్నట్లు తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. తాడేపల్లి పరిధిలోని సీతానగరం ప్రకాశం బ్యారేజ్ వద్ద ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం ఉదయం 9.30 గంటలకు స్వయంగా ఆటో ఎక్కి పథకాన్ని ప్రారంభించనున్నారని పేర్కొంది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్ తదితర మంత్రులు, అధికారులు పాల్గొననున్నట్లు ఆ ప్రకటనలో తెలిపింది.

గుంటూరు జిల్లాలో 3,193 మంది లబ్ధిదారులు

గుంటూరు వెస్ట్: జిల్లాలో 13,193 మంది ఈ పథకం కింద లబ్ధి పొందనున్నారని కలెక్టర్ కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం స్థానిక రెవెన్యూ కల్యాణ మండపంలో కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో చేబ్రోలు మండలంలో 453, దుగ్గిరాల 344, గుంటూరు అర్బన్ 5,078, గుంటూరు రూరల్ 319, కాకుమాను 131, కొల్లిపర 164, మంగళగిరి 516, మేడికొండూరు 404, పెదకాకాని 711, పెదనందిపాడు 153, ఫిరంగిపురం 250, పొన్నూరు 530, ప్రత్తిపాడు 281, తాడేపల్లి 383, తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ 1038, తాడికొండ 440, తెనాలి 1338, తుళ్లూరు 399, వట్టిచెరుకూరు మండలంలో 261 మందికి లబ్ధి కలగనుందని తెలిపారు.

'ఇందిరానగర్ యూపీహెచ్‌సీ'కి ఉత్తమ అవార్డు

మంగళగిరి టౌన్: మంగళగిరి నగర పరిధిలోని ఇందిరానగర్‌లో ఉన్న యూపీహెచ్‌సీ జిల్లాస్థాయిలో ఉత్తమ స్వచ్ఛ హాస్పిటల్‌గా ఎంపికైనట్లు యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.అనూష పేర్కొన్నారు. యూపీహెచ్‌సీలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రస్థాయి స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల జాబితాలో ఈ మేరకు పేరు ప్రకటించడం హర్షించదగ్గ విషయమని అన్నారు. భవిష్యత్తులో మరింత పరిశుభ్రంగా ఉండేలా చూస్తామని, ఉత్తమ సేవలు అందిస్తామని పేర్కొన్నారు.

మందుగుండు సామగ్రి విక్రేత అరెస్ట్

రేపల్లె: నిబంధనలకు విరుద్ధంగా మందుగుండు సామగ్రి తయారు చేసి విక్రయిస్తున్న వ్యక్తిని శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. పట్టణ సీఐ మల్లికార్జునరావు అందించిన వివరాలు.. మండలంలోని పేటేరు గ్రామానికి చెందిన కంబాల ప్రభాకరరావు మందుగుండు సామగ్రిని తయారు చేసి, విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. తనిఖీ నిర్వహించి, అతడిని అదుపులోకి తీసుకున్నారు. మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మందుగుండు సామగ్రి తయారు చేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 94407 96169 నంబరులో ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు.

పండగ పూట పెను విషాదం

- వాగులో మునిగి ముగ్గురు మృత్యువాత
- నల్లగొండ జిల్లా చందంపేట మండలంలో ఘటన


పూర్ణ గోపాలభరత్ మృతదేహం


ఉమా సాయికాంత్ (ఫైల్)


రాము మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

చందంపేట : మొక్కులు చెల్లించుకునేందుకు వచ్చిన ముగ్గురు వ్యక్తులు తిరుగు ప్రయాణంలో స్నానం ఆచరించేందుకు కృష్ణా బ్యాక్ వాటర్‌లో దిగి ప్రమాదవశాత్తు మునిగి మృత్యువాత పడ్డారు. ఈ ఘటన నల్లగొండ జిల్లా చందంపేట మండలంలోని దేవరచర్ల గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తెనాలికి చెందిన కేతావత్ రాము(32), బొల్లాపల్లి మండలం గండిగనుముల గ్రామానికి చెందిన వాంకుడావత్ పూర్ణ గోపాలభరత్ (22), అవనిగడ్డకు చెందిన ఉమా సాయికాంత్ (11)లతోపాటు పలు కుటుంబాలు దేవరచర్లలోని తుల్జా భవాని ఆలయంలో అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేందుకు సెప్టెంబర్ 30న వచ్చారు. అక్కడే బస చేసి మొక్కులు చెల్లించుకున్న అనంతరం తిరుగుప్రయాణం సందర్భంగా గురువారం దేవరచర్ల గ్రామంలో కృష్ణా బ్యాక్ వాటర్, డిండి ప్రాజెక్టు జలాలు కలిసే చోట వాగులో స్నానం చేసేందుకు ఉమా సాయికాంత్ దిగాడు. లోతు ఎక్కువగా ఉండడంతో వాగులో జారిపడి మునిగిపోయాడు. గమనించిన కేతావత్ రాము, పూర్ణ గోపాలభరత్‌లు కాపాడేందుకు వాగులోకి దిగారు. ఈత రాకపోవడం, వాగు లోతు ఎక్కువగా ఉండడంతో ముగ్గురు మృత్యువాత పడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాలను వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించారు.

ఏపీ టెక్స్‌టైల్ మిల్స్ సంఘం రాష్ట్ర కమిటీ బాధ్యతల స్వీకరణ


సమావేశంలో సామినేని కోటేశ్వరరావు, సత్యనారాయణ, కోటిరావు తదితరులు

కొరిటెపాడు (గుంటూరు): ఆంధ్రప్రదేశ్ టెక్స్‌టైల్ మిల్స్ అసోసియేషన్ రాష్ట్ర నూతన కమిటీ గుంటూరులోని లక్ష్మీపురంలో ఉన్న అసోసియేషన్ సమావేశ మందిరంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించింది. రాష్ట్ర అధ్యక్షుడిగా సామినేని కోటేశ్వరరావు, గౌరవాధ్యక్షుడిగా పి.కోటిరావు, ఉపాధ్యక్షులుగా ఎంవీ సత్యనారాయణ, రమేష్‌రాజు, బి.ఉమామహేశ్వరరావు, పి.చలపతిరావు, గౌరవ సలహాదారుగా ఎల్.రఘురామిరెడ్డి, సభ్యులుగా డి.బ్రహ్మానందం, పి.వెంకటేశ్వరరెడ్డి, జి.కోటేశ్వరరావు, డి.సూర్యప్రకాశరావు, డి.చంద్రశేఖర్, కేవీ ప్రసాద్, సీహెచ్‌వీవీ ప్రసాద్ చౌదరి, సీహెచ్ అప్పారావు, కె.వి.రెడ్డి, ఎస్.సాయి నీత్ వెంకటరత్నం, వసంత ధీమంత్ సాయి, ఎ.క్రాంతిలు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో కోటేశ్వరరావు మాట్లాడుతూ.. మిల్లులకు రావాల్సిన రూ.900 కోట్ల సబ్సిడీ మొత్తాన్ని తక్షణమే ఒకే వాయిదాలో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ బిల్లుపై యూనిట్‌కు రూ.2 రాయితీని బిల్లులోనే డిస్కౌంట్ ఇవ్వాలని సూచించారు. టెక్స్‌టైల్ పరిశ్రమల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కమిటీ కృషి చేస్తుందని వెల్లడించారు. రెండు సంవత్సరాలపాటు ఈ కమిటీ కొనసాగుతుందని తెలిపారు. నూతన కమిటీని పలువురు కాటన్ అసోసియేషన్ నాయకులు, స్పిన్నింగ్ మిల్లుల యజమానులు కలిసి అభినందనలు తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృతి


మృతి చెందిన వెంకటసుబ్బారావు


ప్రమాదంలో మృతి చెందిన లక్ష్మి

మేదరమెట్ల: బైక్‌ను కారు ఢీకొని భార్యాభర్తలు మృతి చెందిన ఘటన కొరిశపాడు మండల పరిధిలోని వెంకటాపురం క్రాస్‌రోడ్డు వద్ద శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. జె.పంగులూరు మండలం అలవలపాడు గ్రామానికి చెందిన కొత్తూరు వెంకటసుబ్బారావు(55), భార్య లక్ష్మి(50)తో మోటారు బైకుపై ఒంగోలు వెళ్లి తిరిగి స్వగ్రామం వస్తున్నాడు. వెంకటాపురం క్రాస్ వద్దకు రాగానే బైక్‌ను అలవలపాడు రోడ్డులోకి వెళ్లేందుకు మలుపు తిప్పుతుండగా ఇదే సమయంలో నెల్లూరు నుంచి ఏలూరు వెళ్తున్న కారు బైక్‌ను ఢీ కొంది. దీంతో బైక్‌పై ఉన్న భార్యాభర్త రోడ్డుపై పడిపోయారు. ఇద్దరి తలలకు తీవ్ర గాయాలు కాగా అక్కడికక్కడే దుర్మరణం చెందారు. సమాచారం తెలుసుకున్న మేదరమెట్ల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలను సేకరించారు. అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ మహ్మద్ రఫీ కేసు నమోదు చేశారు.

ఇద్దరు యువకులు దుర్మరణం


యువకుల మృతదేహాలను పరిశీలిస్తున్న ఎస్ఐ మహేంద్ర

జరుగుమల్లి(సింగరాయకొండ): దసరా పండగ పూట రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది. రోడ్డు మార్జిన్‌లో ఆగి ఉన్న టిప్పర్‌ను ప్రమాదవశాత్తు మోటారు సైకిల్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు. ఈ ఘటన బుధవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో మండల కేంద్రమైన జరుగుమల్లిలో పాల కేంద్రం సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాలు.. జరుగుమల్లి మండలం చింతలపాలెం గ్రామంలోని ఎస్టీ కాలనీకి చెందిన కట్టా ప్రవీణ్(21), చీరాల మండలం వాడరేవు గ్రామానికి చెందిన శ్రీరాములు రాజు(20) ఇద్దరూ కలిసి చింతలపాలెం నుంచి టంగుటూరుకు బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి రోడ్డు మార్జిన్‌లో నిలిపి ఉంచిన టిప్పర్ వెనుక భాగాన్ని ఢీకొట్టారు. ఈ ఘటనలో ఇద్దరు యువకులు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.మహేంద్ర తెలిపారు.

పోలీసుల జోక్యంతో వృద్ధుడి అంత్యక్రియలు


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ సురేష్

ఫిరంగిపురం: పోలీసుల జోక్యంతో ఓ వృద్ధుడి అంత్యక్రియలు జరిగాయి. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని మేరికపూడి గ్రామానికి చెందిన డి.వెంకటరెడ్డి (89) సెప్టెంబర్ 30న మృతి చెందాడు. కొన్నేళ్లుగా గ్రామంలోని పెద్ద కుమార్తె సీతామహాలక్ష్మి వద్ద అతడు ఉంటున్నాడు. అంత్యక్రియల విషయమై కుమారుడు కోటిరెడ్డితో సీతామహాలక్ష్మికి విభేదాలు వచ్చాయి. కోటిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ సురేష్ సంఘటనా స్థలానికి వెళ్లి వారికి నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. మృతదేహానికి గుంటూరులో పోస్టుమార్టం చేయించారు. ఇరు కుటుంబాల వారు సయోధ్యగా ఉంటేనే మృతదేహాన్ని అప్పగిస్తామని తేల్చిచెప్పారు. దీంతో కుమార్తెలు, కుమారుడు కలసి వచ్చి శుక్రవారం గ్రామంలోని శ్మశాన వాటికలో పోలీసుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు.

ప్రజలు స్వేచ్ఛగా జీవించాలి

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు రేంజ్‌లోని ప్రతి జిల్లాలో శాంతి భద్రతలు సుభిక్షంగా ఉండాలని, ప్రజలు స్వేచ్ఛగా జీవించాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి అన్నారు. విజయ దశమి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం కలెక్టర్ బంగ్లా రోడ్డులోని రేంజ్ ఐజీ కార్యాలయంలో దుర్గామాతకు విశేష పూజలు నిర్వహించారు. రేంజ్ ఐజీ మాట్లాడుతూ ప్రజలకు సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. పోలీస్ అధికారులు, సిబ్బందికి మిఠాయిలు అందించారు.

జీఎస్టీ తగ్గింపుతో పేద వర్గాలకు మేలు

నగరం: కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ వలన పేద, మధ్య తరగతి వర్గాలకు ప్రయోజనం చేకూరుతుందని జీఎస్టీ డెప్యూటీ కమిషనర్ ఎం.కనికిరెడ్డి చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జీఎస్టీ సేవింగ్స్‌పై గ్రామ సచివాలయ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. నిత్యావసరాలపై జీఎస్టీ భారీగా తగ్గినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఏఓ రమేష్‌బాబు, విద్యుత్‌శాఖ ఏఈ నాగుల్‌మీరా పాల్గొన్నారు.